సిరిసిల్ల ఠాణా ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు సబ్బని హరీశ్, నాయకులు

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

సిరిసిల్ల రూరల్, జూలై 15: నిర్బంధాలతో నిరుద్యోగుల ఉద్యమాలను ఆపలేరు.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్ ఫైర్ అయ్యారు. నిరుద్యోగులు రాష్ట్ర సచివాలయ ముట్టడి నేపథ్యంలో సిరిసిల్లలో బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు పోలీస్‌స్టేషన్ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, గ్రూప్-2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్ష వాయిదా, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో సోమవారం రాష్ట్ర సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునిచ్చారన్నారు. వారికి మద్దతుగా వెళ్తున్నామనే ఉద్దేశంతోనే ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాపాలన అని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల అండతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వాళ్ల మీదనే ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. త్వరలోనే ప్రజలంతా రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇక్కడ ఎస్‌కే బాబా, మెట్టెల సాయి, దీపక్, కనకుంట్ల వెంకటరమణ, రోహిత్, కోడం వెంకటేశ్, జయచంద్ర, వినయ్, తదితరులు ఉన్నారు.

రాజన్న భక్తులకు శ్రావణంలో బ్రేక్ దర్శనం

గుడి చెరువు సుందరీకరణ బ్రోచర్లను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్

- ఆధునాతన సౌకర్యాలతో వసతి సముదాయం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వీటీడీఏ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి సమీక్ష

వేములవాడ, జూలై 15: రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అధునాతన వసతి సౌకర్యాలతో వసతి సముదాయాన్ని నిర్మిస్తామని, వచ్చే శ్రావణ మాసం నుంచి భక్తులకు అందుబాటులోకి బ్రేక్ దర్శనం తీసుకువస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయ సమావేశ మందిరంలో వీటీడీఏ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఈవో వినోద్‌రెడ్డితో కలిసి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విప్ మాట్లాడుతూ, రాజన్న గుడి చెరువులో భక్తుల కోసం అత్యాధునిక వసతులతో ₹32 కోట్ల అంచనాలతో 96గదులు నిర్మించేందుక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ నిర్మాణంలో భాగంగా ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి మాట్లాడుతూ, శ్రావణం నుంచి భక్తులకు బ్రేక్ దర్శ నం అందుబాటులోకి తేస్తామన్నారు. వీటీడీఏ పనుల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ₹2కోట్లతో చేపట్టిన మున్సిపల్ పార్క్ నిర్మాణాలు తుది దశలో ఉన్నట్టు చెప్పారు. ₹30లక్షలతో రాజన్న ఆలయ సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చేపట్టనున్నట్టు మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, టూరిజంశాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, రామేశ్వర్ రావు, ఆర్అండ్‌బీ ఏఈ సతీశ్, డీటీసీపీవో అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

'కలికోట-సూరమ్మ'
పనుల్లో వేగం పెంచండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కలెక్టర్లతో కలిసి ప్రాజెక్టు పనుల పరిశీలన

రుద్రంగి: కలికోట-సూరమ్మ ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్లు

రుద్రంగి, జూలై 15: కలికోట-సూరమ్మ ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. రుద్రంగిలోని కలికోట-సూరమ్మ ప్రాజెక్టును సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, కలికోట-సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా నియోజకవర్గంలో 43వేల ఎకరాలకు సాగునీరు అందించే పనుల పురోగతిని పరిశీలించినట్టు తెలిపారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించి కాలువలకు భూసేకరణ జరిపి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ప్రాజెక్టు ఆవశ్యకతను గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీలత, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ ప్రభలత పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

వేములవాడ, జూలై 15: వేములవాడ పట్టణ జనాభాకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అమృత్ 2.0లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ₹14 కోట్ల నిధులతో సోమవారం పట్టణంలోని బాలనగర్‌లో తాగునీటి అవసరాలకు కోసం పనులను కలెక్టర్ సందీప్ కుమార్‌ఝూ, మున్సిపల్ చైర్‌పర్సన్‌మాధవితో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలనగర్‌లో 8లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, డీఈ తిరుపతి, ఏఈ నర్సింహస్వామి, కౌన్సిలర్లు జోగిని శంకర్, నరాల శేఖర్, నాయకులు పుల్కం రాజు, సుమంత్‌రెడ్డి, సంఘుస్వామి, చంద్రగిరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మల్రెపల్లి రిజర్వాయర్ పరిశీలన

వేములవాడ రూరల్, జూలై 15: మల్రెపల్లి, ఫాజుల్‌నగర్ రిజర్వాయర్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మల్రెపల్లి, ఫాజుల్ నగర్ రిజర్వాయర్ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని అదేశించారు. అనంతరం రిజర్వాయర్లకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

చందుర్తి, జూలై 15: మండల కేంద్రం నుంచి మోత్కురావుపేట వరకు ప్రగతిలో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. చందుర్తి-మోత్కురావుపేట వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి సోమవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. 3.4కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారిని విప్ ఆదేశించారు. అనంతరం వారు జోగాపూర్‌లోని పం ప్ హౌస్‌ను పరిశీలించారు. ఇక్కడ అటవీ శాఖ అధికారి బాలామణి, ఆర్డీవో రాజేశ్వర్, ఆర్అండ్‌బీ ఏఈ సతీశ్ ఉన్నారు.

సుద్దాల గ్రామంలో రోడ్డుపై కూర్చుండి ఏడుస్తున్న మానస

భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

- ప్రేమించి పెండ్లి చేసుకుని మోసం చేశాడని భార్య ఆరోపణ
- ఇంటికివచ్చి నిలదీయడంతో కుటుంబ సభ్యుల దాడి
- సుద్దాలలో ఘటన

కోనరావుపేట, జూలై 15: ఏడేండ్లుగా ప్రేమించి పెండ్లి చేసుకుని.. ప్రస్తుతం తనను వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నాడని.. ఇందేటని ప్రశ్నిస్తే కుటుంబ సభ్యులు దాడి చేశారని ఓ వివాహిత తన భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. ఈ ఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. బాధితురాలి వివరాల ప్రకారం.. మాది పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామం. తాను హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. సుద్దాల గ్రామానికి చెందిన పడిగెల అక్షయ్ ప్రేమ పేరుతో ఏడేండ్లుగా వెంబడించాడు. అతడి ప్రేమను నమ్మి గత మే 24న పెండ్లి చేసుకుని, దీంతో హైదరాబాద్‌లో ఉంటున్నామని తెలిపింది. ఈ విషయం అక్షయ్ తల్లిదండ్రులకు తెలియడం వారు కొందరు పెద్దలతో కలిసి హైదరాబాద్ వచ్చారని చెప్పింది. అక్షయ్‌ని వదిలేస్తే కొంత డబ్బు ఇస్తామని వారు చెప్పగా తాను ఒప్పుకోలేదన్నారు. పెండ్లయి 15రోజుల తర్వాత ఇంటికి వెళ్లివస్తానని చెప్పి అక్షయ్ స్వగ్రామానికి వచ్చాడని, రెండు రోజుల తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని తెలిపింది. తాను గర్భిణి అని.. తనను మోసం చేయవద్దని అక్షయ్‌ని కోరగా, అతడి కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారని వారి ఇంటి ఎదుట బైఠాయించి వాపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మానసను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువకుడు అదృశ్యం

సిరిసిల్ల రూరల్, జూలై 15: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన టేకు మల్లేశ్ (24) ఈ నెల 14న రాత్రి వేళలో బాత్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి, ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన చోటల్లా వెతికిన ఆచూకీ లభించలేదు. మల్లేశ్ తండ్రి చంద్రయ్య ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

కలెక్టరేట్, జూలై 15: ప్రజావాణికి వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అర్జీలు స్వీకరించి, వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కాగా, సోమవారం ప్రజావాణికి 150 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

పెద్దూరులో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో గల సమస్యలను పరిష్కరించాలని ప్రజలంతా సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూకు మొరపెట్టుకున్నారు. బోర్లు ఉన్నా.. మోటార్లు లేవని, దేవాలయానికి స్థలం కేటాయించాలని, వీధిలైట్లు వెలుడం లేదని, సిరిసిల్లకు రావడానికి రవాణా సౌకర్యం లేదని, సముదాయంలో ప్లాంటేషన్, పిల్లల పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి పెద్దూరు వాసుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

యజమానులపై చర్యలు తీసుకోండి

తక్కువ రేటుకు ప్లాట్లను తీసుకుని ఇప్పటి వరకు టెక్స్‌టైల్ పార్క్‌లో పరిశ్రమలు ప్రారంభించని యజమానులపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో రాజన్నసిరిసిల్ల పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జనరల్ సెక్రటరీ మూషం రమేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిర్మాణం పూర్తయిన క్యాంటీన్‌ను వెంటనే ప్రారంభించాలన్నారు. క్యాంటీన్ హాల్‌ను కార్మికుల సమావేశ మందిరంగా వినియోగించేలా చూడాలన్నారు. కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే టెక్స్‌టైల్ పార్క్‌లో పవర్‌లూం కార్మికులకు బతుకమ్మ చీరల 10శాతం యారన్ సబ్సిడీని కాలయాపన చేయకుండా అందించాలని కలెక్టర్‌ను కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

జిల్లా పరిధిలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేరు ఫ్లెక్సీలపై ఫొటోను ఈ నెల 13న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో విస్మరించినందున సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

బయటపడ్డ మృతదేహం.. ట్రాక్టర్

వేములవాడ రూరల్, జూలై15: నూకలమర్రి గ్రామానికి చెందిన కైర శేఖర్ (32) పొలం దున్నే క్రమంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌తో సహా పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. ఆదివారం రాత్రి వరకు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసేందుకు యత్నించారు. అయితే బావిలో నీరు ఎక్కువగా ఉండటం.. క్రేన్ వైర్ సరిపోకపోవడంతో సోమవారం ఉదయం మృతదేహంతోపాటు ట్రాక్టర్‌ను బయటకు తీశారు. శేఖర్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మారుతి తెలిపారు.

ట్రాక్టర్ గొర్రు తగలి రైతు మృతి

సిరిసిల్ల రూరల్, జూలై 15: తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలో సోమవారం ట్రాక్టర్ గొర్రు తగిలి గ్రామానికి చెందిన బల్లెపు శంకరయ్య(55) అనే రైతు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శంకరయ్య తన పొలం పనులు పూర్తి చేసుకుని, ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ ట్రాక్టర్‌కు వెనుకాల ఉన్న గొర్రు తగలడం శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శంకరయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొన్నది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

అమ్మ మాట- అంగన్‌వాడీ బాట

- పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని విజ్ఞప్తి

వేములవాడ: పట్టణంలో బడిబాట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

వేములవాడ/రుద్రంగి/కోనరావుపేట/వేములవాడ రూరల్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/ చందుర్తి, జూలై 15: జిల్లావ్యాప్తంగా సోమవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేండ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని టీచర్లు కోరారు. కేంద్రాల్లో అందించే పాలు, కోడిగుడ్లు, పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సీడీపీవో ఎల్లయ్య ప్రారంభించారు. ఇక్కడ కౌన్సిలర్ మారం కుమార్, సూపర్‌వైజర్ కనకమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శోభ, సరస్వతి, సరోజన, మునెమ్మ, శ్రీవాణి జ్యోతి ఉన్నారు.

- రుద్రంగి మండల కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అమ్మ మాట-అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఇక్కడ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మంజుల, జ్యోతి, సరిత, కవిత, అనసూయతోపాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.
- కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అమ్మ మాట-అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ సూపర్‌వైజర్ గంగలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, లక్ష్మి, స్వప్న, శీల, వెంకటరమణాదేవి, కనకలక్ష్మీ, మాధవి, తదితరులు ఉన్నారు.
- వేములవాడ, వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో అమ్మ మాట-అంగన్‌వాడీ బడిబాటపై ర్యాలీలు తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను వివ రించారు. ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.
- చందుర్తి మండల కేంద్రంతోపాటు మల్యాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఇక్కడ హెచ్ఎం శరత్‌చంద్ర, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.
- ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై అవగాహన ర్యాలీ తీశారు. ఐదేండ్ల లోపు చిన్నారులను కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ నెల 20న చిన్నారులకు అక్షరాభ్యాసం ఉంటుందని చెప్పారు.
- బోయినపల్లి మండలం కోరెంలో అమ్మ మాట, అంగన్‌వాడీ బడి బాటలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ తీశారు. ఐదేండ్ల లోపు చిన్నారులను తప్పనిసరిగా కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు కోరారు. ఇక్కడ హెచ్ఎంలు జలంధర్, పరశురాములు, కార్యదర్శి రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

రక్తహీనత నివారణపై శిక్షణ

వేములవాడ, జూలై 15: ఎనీమియా ముక్తి భారత్‌లో భాగంగా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేములవాడ, వేములవాడ రూరల్ మండల పరిధిలోని ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో మొట్టమొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రిసోర్స్ పర్సన్లు పులి రాంగోపాల్‌గౌడ్, సంతోష్ తెలిపారు. రక్తహీనత గల పిల్లలను గుర్తించి వారిని చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి అవసరమైన ఐరన్, పోలిక్ యాసిడ్ వంటి మాత్రలను ఇప్పించి రక్తహీనతను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇక్కడ మండల నోడల్ ఆఫీసర్లు కిషన్ తిరుపతి, కాంప్లెక్స్ హెచ్ఎం సదానందం, రాజారత్నం, శ్రీకాంత్‌రావు, తదితరులు ఉన్నారు.

రైల్వేలైన్ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

- కలెక్టరేట్ ఎదుట బాధిత రైతుల నిరసన

కలెక్టరేట్, జూలై 15: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ భూసేకరణలో భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలని సోమవారం సమీకృత కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేములవాడ పట్టణాన్ని అనుకొని చేపట్టే స్టేషన్ నిర్మాణంలో తమ భూములు కోల్పోతున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి ₹5కోట్ల ధర ఉందని, ప్రభుత్వం కూడా ఇంతే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొందరు రైతుల భూములకు ఎకరానికి ₹35లక్షల పరిహారం ఇచ్చారన్నారు. పరిహారం అందని తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎకరానికి ₹5కోట్లు చెల్లించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇక్కడ ఏ రాజేందర్, ఎం లక్ష్మణ్, కే దేవయ్య, వీ కనకయ్య, డీ రమేశ్, ఎల్లయ్య, వేణు, రవి, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సుంకపాక మనోజ్

కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరు

రాజన్న సిరిసిల్ల, జూలై 15 (నమస్తే తెలంగాణ): అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సుంకపాక మనోజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రజాపాలన పడకేసిందని ఆరోపించారు. పుట్టిన శిశువు నుంచి మొదలు వృద్ధుల వరకు అందరూ ఇబ్బంది పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పుట్టిన బిడ్డకు కేసీఆర్ కిట్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఇవ్వడం లేదన్నారు. పింఛన్లు ₹4వేలు ఇస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా ఇవ్వలేదని విమర్శించారు. ఉద్యోగాలు అడిగిన పాపానికి నిరుద్యోగులను పోలీసులతో గొడ్డును బాదినట్లు చావబాదిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు అంటే ఇదేనా? అంటూ ప్రశ్నించారు. ఇక్కడ కత్తెర వరుణ్‌కుమార్, మెట్ట రాజు, మునీర్‌షా ఉన్నారు.

కుటీర పరిశ్రమగా గుర్తించండి

కలెక్టరేట్, జూలై 15: సిరిసిల్లలోని పవర్‌లూమ్ పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించాలని పాలిస్టర్, కాటన్ పవర్‌లూమ్స్ ఆసాముల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశం కోరారు. సోమవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం దాసరి వెంకటేశం మాట్లాడుతూ, సిరిసిల్లలో నడిచే పవర్‌లూమ్స్ చిన్న పరిశ్రమ అని.. దానిని కుటీర పరిశ్రమగా గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కరెంట్ సబ్సిడీ ఇచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని సెస్ సంస్థ గుర్తించి 10హెచ్‌పీల వరకు సబ్సిడీ ఇస్తామని మిగతావి మీటర్ రిటర్న్ ఇస్తే తిరిగి 10 హెచ్‌పీలకు సబ్సిడీ కొనసాగిస్తామని ప్రకటన ద్వారా తెలిపారన్నారు. రిటర్న్ ఇచ్చే మీటర్ల ఆసాములకు యథావిధిగా కరెంట్ సరఫరా చేయాలని కోరారు. ఇక్కడ వెంగల అశోక్, ఏ సత్యం, కే మైసయ్య, ఏ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 15: మండల కేంద్రంలోని సహకార సంఘంలో ఇద్దరు రైతులకు రూ.9లక్షల విలువైన చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని కోరారు. ఇక్కడ డైరెక్టర్ నేవూరి వెంకటనర్సింహారెడ్డి ఉన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా, నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్, లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ భూక్య రజిత W/o మంగ్య, మద్దిమల్ల గ్రామం, వీర్నపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయంలో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం ప్లాట్ నెం:12, దీని యొక్క విస్తీర్ణం. 200 చ.గ. దీని యొక్క సర్వేనెం:309/3, వీర్నపల్లి గ్రామం మరియు మండలం రాజన్న సిరిసిల్ల జిల్లా నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఏలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ వ్యాజములు ఉన్నచో ఈప్రకటన వెలువడిన (7) దినములలోగా తగు దస్తావేజులతో నాకార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని దృవీకరించబడును.

తేదీ: 16-07-2024 స్థలము:సిరిసిల్ల

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్, ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

వేములవాడ ఏఎస్పీకి సన్మానం

బోయినపల్లి, జూలై 15: ఏఎస్పీ శేషాద్రినీరెడ్డిని సోమవారం వేములవాడలోని కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొట్టెపల్లి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఏఎస్పీకి శాలువా కప్పి సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని సుధాకర్ కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

చందుర్తి/రుద్రంగి, జూలై 15: చందుర్తి, రుద్రంగి మండల కేంద్రాల్లోని ఎస్సీ, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన నోట్‌బుక్‌లను సంక్షేమ వసతిగృహ అధికారి రవీంద్రస్వామి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నదని తెలిపారు. అలాగే ప్రతి ఆదివారం చికెన్ బిర్యాని, పాలు, కోడి గుడ్లతోపాటు అల్పాహారం అందిస్తున్నట్టు చెప్పారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ సమావేశం

కలెక్టరేట్, జూలై 15: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని దాసరి విజయ్‌కుమార్ ఐటీ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో నూతన ఆర్గనైజింగ్ సెక్రటరీగా కనకం శ్రీనివాస్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా నేరెళ్ల గంగాధర్‌ను అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఆమోదంతో నియమించామని విజయ్‌కుమార్ వెల్లడించారు. వీరికి జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ నియామక పత్రాలు అప్పగించారు. సమావేశంలో కోశాధికారి భూక్యా వినోద్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ సుంకటి అజయ్‌కుమార్, ఈసీ మెంబర్ దాసరి విజయ్‌కుమార్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గొట్టిముక్కల శేఖర్, ఎస్‌జీఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి దుప్పటి రవికుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దంచికొట్టింది

- జిల్లాలో భారీ వర్షం

రాజన్న సిరిసిల్ల, జూలై 15 (నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా సోమవారం వాన దంచికొట్టింది. సాయంత్రం 4గంటలకు మొదలైన వాన అన్ని మండలాల్లో కురిసింది. కార్మిక, ధార్మిక క్షేత్రాలతోపాటు అన్ని గ్రామాల్లో భారీ వర్షం పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సిరిసిల్ల పట్టణంలో 32మిల్లీమీటర్లు, పెద్దూరులో 20.5, ఇల్లంతకుంట మండల కేంద్రంలో 15.8, పెద్దలింగాపూర్‌లో 2.5, వేములవాడ రూరల్ మండలం మల్లారంలో 11.5, నాంపల్లిలో 10.5, ముస్తాబాద్ మండలంలో ఆవునూరులో 2.8, గంభీరావుపేటలో 0.8, వీర్నపల్లిలో 0.8, రుద్రంగి మం డలంలో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఇల్లంతకుంట, జూలై 15: మండల కేంద్రంలో తోపాటు పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వానకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు భారీ వర్షం పడకపోవడంతో ఆరుతడి పంటలు నీటి ఎద్దడికి గురవుతున్నాయని అన్నదాతలు ఆవేదన చెందారు. ఈ క్రమంలో సోమవారం వర్షం పడడంతో సంతోషం వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

సిరిసిల్ల రూరల్, జూలై 15: బీఆర్ఎస్ సీనియర్ నేత, గోపాలరావుపల్లె మాజీ ఎంపీటీసీ ములిగే దుర్గాప్రసాద్‌ను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సన్మానించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి రాంరెడ్డి, మీరాల శ్రీనివాస్‌యాదవ్, నక్క సతీశ్, నూనె కిషన్, ఇంద్రరెడ్డి, సత్తయ్య, లిం గారెడ్డి, అంజయ్య, సంజీవ్‌రెడ్డి, దేవయ్య, శ్రీను, పార్వతి వెంకటి, మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

క్షుద్రపూజల కలకలం

రుద్రంగి, జూలై 15: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేయడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, నిమ్మకాయలతోపాటు నల్ల కోడి, పిండితో చేసిన బొమ్మ దర్శనం ఇవ్వడంతో గ్రామస్తులు, విద్యార్థులు కంగారుపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.